




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 279 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శనివారం 15 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 279 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 15 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur





రాష్ట్రపతి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం..

## సింధూ ఒప్పందం రద్దు.. పాకిస్తాన్‌పై కీలక వ్యాఖ్యలు

80 వ స్వాంతంత్ర్య దినోవ్సవం సందర్భంగా 2026 ఆగస్టు 14న జాతినుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కీలక ప్రసంగం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం నిర్ణయాకత్మక చర్య అని ఈ సందర్భంగా అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నవారికి ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేశారు. అదే విధంగా ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా పర్యవసానాలు ఎదుర్కోవాల్సిందేనని.. ఆపరేషన్ సింధూర్ ద్వారా సాయుధ బలగాలు చూపిన శౌర్యాన్ని గుర్తు చేశారు.నక్సలైట్ల నిర్మూలన దేశం సాధించిన గొప్ప విజయమని ఈ సందర్భంగా చెప్పారు. బస్తర్ ప్రాంతంలో నక్సలిజం తగ్గి.. సాంస్కృతికంగా చాలా మార్పులువస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఎకానమీ వృద్ధిలోనే ఉందని ఈ సందర్భంగా ముర్ము చెప్పారు. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల ప్రజలను పేదరికం నుంచి బయటవేసినట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని అన్నారు. పేదలకు కూడా న్యాయం అందాలని ఆకాంక్షించారు. జుడీషియల్ వ్యవస్థలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని ఆలోచించాలని సూచించారు.

## డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే...



- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం
- లోటు వర్షపాతం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడాలని అధికారులకు స్పష్టం
- పోలవరం, వెలిగొండ సహా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సూచన
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం

-మిగతా2లో

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు

- అమరావతి పేరుతో భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న అంబటి
- తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో వేల కోట్లు తగలేస్తున్నారని ఆరోపణ
- కమీషన్ల కోసం అంచనాల బడ్జెట్ పెంచుకుంటూ పోతున్నారని విమర్శ



అమరావతి రాజధాని నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతి అనేది అద్భుత నగరం ఎంతమాత్రం కాదని అన్నారు. అది కేవలం అవినీతి, దోపిడీకి నిలయంగా మారిందని విమర్శించారు. రాజధాని నిర్మాణాలు ఎప్పటికీ పూర్తి కావని... తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో అప్పులు చేసి మరీ వేల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ, 22 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని

-మిగతా2లో



## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

### రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన ఫైర్ వాహనాలకు జెండా ఊపిన సీఎం చంద్రబాబు

- వీటిలో ఫైర్ ఫైటింగ్ వాహనాలు, వాటర్ బౌజర్లు, క్విక్ రెస్పాన్స్ వెహికల్స్ ఉన్నాయి
- మూడు దశల ఆధునీకరణ ప్రణాళికలో భాగంగా రెండో విడతలో ఈ వాహనాల కొనుగోలు
- ప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సమర్థవంతంగా స్పందించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టారు.



కొత్తగా సమకూర్చిన ఈ వాహనాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు.

-మిగతా2లో



## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

### జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

- సోషల్ మీడియా వాడకంపై జనసేన శ్రేణులకు పవన్ కల్యాణ్ మార్గదర్శకాలు
- వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం వాడొద్దని స్పష్టం
- కూటమి ప్రభుత్వ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలని సూచన
- పార్టీ క్రమశిక్షణ, అంతర్గత విషయాలపై 9 కీలక మార్గదర్శకాలు జారీ

సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

-మిగతా2లో


## స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

### రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై ఆకునూరి మురళి ఆందోళన
- భారీ ఫీజులతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచన
- ఫీజుల నియంత్రణ కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడి
- తల్లిదండ్రులు, విద్యావేత్తలు హాజరుకావాలని పిలుపు

-మిగతా2లో



సూర్యుడి అతిపెద్ద రహస్యంపై కీలక ఆధారాలు!

## ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..

- సూర్యుడి కరోనా వేడి రహస్యంపై కీలక ఆధారాలు సేకరించిన ఆదిత్య ఎల్1
- భారత్ తొలి సోలార్ మిషన్ పరిశోధనలో వెల్లడైన కొత్త విషయాలు
- ఉపరితలం కన్నా వాతావరణం కొన్ని మిలియన్ డిగ్రీలు వేడిగా ఉండటానికి కారణాలపై అధ్యయనం
- సౌర తుఫాన్ల తర్వాత శక్తి ఎలా భర్తీ అవుతుందో వివరించిన భారత శాస్త్రవేత్తలు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

-మిగతా2లో

## నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలన్న నిమ్మల
- ఏపీ అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడి
- నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు వ్యవహరించాలన్న నిమ్మల

-మిగతా2లో



## సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!



- బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశాలు
- ఇటీవలే భారత్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి
- పశ్చిమాసియా భద్రతలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని వ్యాఖ్య
- ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ భారత పర్యటనకు ప్రాధాన్యం

-మిగతా2లో

## నీరే మాకు ఆధారం.. భారత్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకుంటాం

- సింధు నదీ జలాల వివాదంపై షెహబాజ్ షరీఫ్ ఘాటు వ్యాఖ్యలు
- పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటే తమ దేశం సహించదని వ్యాఖ్య
- తమ నీటి హక్కుల కోసం అన్ని వేదికలపై పోరాడుతామని హెచ్చరిక

-మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# అసెంబ్లీ సమావేశాల్లో కూటమి కౌంటర్ ఎటాక్

ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ , వైసీపీల మధ్య నిత్యం హోరాహోరీ పోరు జరుగుతుంటుంది. ఇక ఈ నెల 17వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో మండలిలో వైసీపీ అధికార పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేసేందుకు సిద్ధమవుతుండగా, అధికార పార్టీ అందుకు కౌంటర్ స్కెచ్ వేసింది. ప్రత్యర్థుల నోళ్లు తెరవకుండా చేయాలని టీడీపీ సిద్ధమవుతుంది. ఇందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. వారు ఒకటంటే.. వీరు పది మాటలతో విరుచుకుపడాలని భావిస్తున్నారు. అందుకే అసెంబ్లీ సమావేశాల్లో వైసీపీపై ఎదురు దాడి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది.

**మెగా డీఎస్సీపై నిరసనలు...**

గత కొన్నిరోజులుగా అధికార పార్టీపై వైసీపీ ఆందోళనలను, నిరసనలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టింది. మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని, అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా అనర్హులకు, తమకు అనుకూలురైన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని, స్పోర్ట్స్ కోటాలో వారిని తెచ్చి అర్హులైన నిరుద్యోగులను అన్యాయం చేశాని ఆరపిస్తుంది. జీవోను తెచ్చి మళ్లీ ఉద్యోగాల భర్తీ తర్వాత ఆ జీవోను తొలగించిందని వైసీపీ ప్రధాన ఆరోపణ. మెగా డీఎస్సీ అవకతవకలపై నిరసనలు, ఆందోళనలతో పాటు ర్యాలీలను కూడా నిర్వహించింది. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, అలాగే మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ తో ఈ ఆందోళనలను చేస్తూ ప్రభుత్వాన్ని, టీడీపీని వైసీపీ ఇరుకున పెట్టే ప్రయత్నం చేసింది. మండలిలోనూ మెగా డీఎస్సీపై చర్చ జరగాలని పట్టుబట్టనుంది.

**ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో ...**

అయితే అధికార టీడీపీ వైసీపీకి కౌంటర్ అటాక్ చేయడానికి సిద్ధమయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఎదురుదాడికి టీడీపీ సిద్ధమవుతుంది. ఈ మేరకు చంద్రబాబు మంత్రులకు హితబోధ చేశారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో జవాబుపత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ ఇప్పటికే కూటమి ప్రభుత్వం స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కొందరిని అరెస్ట్ చేసి విచారణ చేసింది. తమవారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలిచేశారని టీడీపీ ఆరోపణలకు దిగనుంది. రేపు జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో వైసీపీ హయాంలోని ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై వ్యవహారంపై చర్చించేందుకు సిద్ధమవుతుంది. సిట్ నివేదికపై కోర్టు నిర్ణయం తర్వాత చూద్దామని, ముందుగా అవకతవకలపై చర్చ జరపాలని మాత్రం టీడీపీ స్కెచ్ వేసింది. దీంతో మండలి, శాసనసభల సమావేశాలు హాట్ హాట్ గా సాగనున్నాయి.

# ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..

భారత అంతరిక్ష పరిశోధనలో ప్రతిష్ఠాత్మకమైన ఆదిత్య-ఎల్1 సౌర యాత్ర అద్భుతమైన ఫలితాలను అందిస్తోంది. సూర్యుడికి సంబంధించి దశాబ్దాలుగా అంతుచిక్కని ఓ అతిపెద్ద రహస్యాన్ని ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సూర్యుడి ఉపరితలం కన్నా దాని బాహ్య వాతావరణం (కరోనా) మిలియన్ల డిగ్రీల మేర అత్యంత వేడిగా ఎందుకు ఉంటుందనే మిస్టరీపై ఈ పరిశోధన కొత్త విషయాలను తెరపైకి తెచ్చింది. భారత్ మొట్టమొదటిసారిగా సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 నుంచి అందిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ వివరాలను వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన ప్రొఫెసర్ ఆర్. రమేశ్ నేతృత్వంలోని బృందం చేసిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. శాస్త్రవేత్తలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రశ్న.. సూర్యుడి ఉష్ణోగ్రత తీరు. సూర్యుడి కేంద్రంలో దాదాపు 1.5 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ, మన కంటికి కనిపించే ఉపరితలం (ఫొటోస్ఫియర్) వద్ద కేవలం 5,500 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఆశ్చర్యకరంగా, ఉపరితలానికి ఎంతో దూరంలో ఉండే బాహ్య వాతావరణమైన కరోనాలో ఉష్ణోగ్రత సుమారు 20 లక్షల డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఏకంగా 4 కోట్ల డిగ్రీలకు కూడా చేరుకుంటుంది. వేడి పుట్టే కేంద్రం నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గాల్సింది పోయి, ఇలా విపరీతంగా పెరగడం భౌతిక శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా అనిపించడంతో ఇది సౌర శాస్త్రంలో ఓ పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది. సూర్యుడి నుంచి వెలువడే సౌర జ్వాలలు (సోలార్ ఫ్లేర్స్), కరోనల్ మాస్ ఎజెక్షన్స్ (సీఎంఈ) వంటి తీవ్రమైన సౌర తుపానులకు కరోనానే పుట్టినిల్లు. ఈ ప్రక్రియలో సూర్యుడు భారీ పరిమాణంలో శక్తిని, ఆవేశపూరిత కణాలను అంతరిక్షంలోకి విడుదల చేస్తాడు. దీనివల్ల భూమిపై అరోరాల వంటి అందమైన దృశ్యాలు ఏర్పడినప్పటికీ.. పవర్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నావిగేషన్ వ్యవస్థలు, శాటిలైట్లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రొఫెసర్ రమేశ్ ప్రకారం, సూర్యుడు సాధారణంగా తక్కువ చురుకుగా ఉన్నప్పుడు రోజుకు రెండు నుంచి మూడు సీఎంఈలను విడుదల చేస్తాడు. అదే 11 ఏళ్ల సౌర చక్రంలో గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు రోజుకు పదికి పైగా తుపానులను సృష్టిస్తాడు. ఈ క్రమంలో నిరంతరం శక్తిని కోల్పోతున్నప్పటికీ, కరోనా తన అత్యధిక ఉష్ణోగ్రతను ఎలా నిలబెట్టుకోగలుగుతుందనేది శాస్త్రవేత్తలకు అంతుబట్టలేదు. ఒకవేళ ఆ కోల్పోయిన శక్తి తిరిగి భర్తీ కాకపోతే, సూర్యుడు క్రమంగా చల్లబడిపోయి, సౌర వ్యవస్థ మొత్తం ప్రభావితమయ్యేది. ఆదిత్య-ఎల్1 అందించిన డేటా, ఈ శక్తిని కరోనా ఎలా తిరిగి పొందుతుందో వివరిస్తోంది. సౌర తుపానుల ద్వారా శక్తిని కోల్పోయినప్పటికీ, కొన్ని ప్రత్యేక ప్రక్రియల ద్వారా కరోనా తన ఉష్ణోగ్రతను పునరుద్ధరించుకుంటుందని భారత శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. ఈ ఆవిష్కరణ సౌర భౌతిక శాస్త్రంలో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, భూమిపై సాంకేతిక వ్యవస్థలను ప్రభావితం చేసే సౌర తుపానులను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి దోహదపడుతుంది.

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

విధంగా కిలోమీటర్ రోడ్డుకు రూ. 180 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు సరైన న్యాయం జరగలేదని, కమీషన్ల కోసమే అంచనాల బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు.

# డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే...

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు భారీగా నీటిని కేటాయిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అది కేవలం దుష్ప్రచారమేనని, డేటా సెంటర్ల పూర్తిస్థాయి అవసరాలకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అపోహలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం పరిస్థితుల దృష్ట్యా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. నేడు సచివాలయంలో జలవనరుల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగానే నీటి నిర్వహణ చేపట్టాలని, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలతో పాటు భూగర్భ జలాలను అత్యంత సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటివరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని తెలిపారు.

దీనిపై స్పందించిన సీఎం, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల మనోభావాలను గౌరవించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విశాఖపట్నం వరకు ఎడమ కాలువ పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. పోలవరం కుడి, ఎడమ కాలువలకు మంచి పేర్లను సూచించాలని కోరారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు పెంచేందుకు 'జలధార-జలహారతి' కార్యక్రమాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతగా గుర్తించిన 36 ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న ఆయకట్టుకు నీరందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్), వివిధ ప్రాజెక్టుల సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొననున్నట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ వెల్లడించింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది.

పెజెష్కియాన్ పర్యటనకు మరో ప్రాధాన్యం ఉంది. 2024 అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు.

ఇరాన్ 2024లో బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యత్వం పొందింది. అదే సమయంలో ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ కూడా కూటమిలో చేరాయి. 2025లో ఇండోనేషియా సభ్యత్వం పొందడంతో బ్రిక్స్ పూర్తిస్థాయి సభ్యుల సంఖ్య 11కి చేరింది. ఇటీవలే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ భారత్‌కు వచ్చారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని చెప్పారు. అవసరమైతే భారత్ చేపట్టే నిర్మాణాత్మక ప్రయత్నాలను స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

హర్మూజ్ జలసంధిలో వాణిజ్య భద్రతకు ఇరాన్ కట్టుబడి ఉంటుందని అరాఘ్చీ తెలిపారు. సైనిక పరిష్కారం కంటే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడమే మార్గమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ భారత్ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

# నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం నీటిని వినియోగించుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి గోదావరి నదీ యాజమాన్య బోర్డు (+=వీదీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) సమావేశాలు ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి ఉన్న అభ్యంతరాలను

ఇప్పటికే జీఆర్ఎమ్‌బీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. జీఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు పరస్పరం వ్యవహరించాలని సూచించారు. ఇదే క్రమంలో గోదావరి - కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై కూడా ఆయన మాట్లాడారు. ఈ అనుసంధానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు.

# హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

-మొదటిపేజీ తరువాయి

పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

**జనసేన శ్రేణులు పాటించాల్సిన 9 మార్గదర్శకాలు:**

1. వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లవద్దు.
2. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా స్పందించాలి.
3. ఏదైనా విషయం మీద మాట్లాడే సమయంలో ఆవేశాలకు లోను కావద్దు. అసభ్య పదజాలాన్ని వాడవద్దు.
4. మహిళలను గౌరవించి మాట్లాడాలి.
5. పార్టీ అంతర్గత అంశాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడరాదు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని పార్టీ ఉపేక్షించదు.
6. పార్టీ క్రమశిక్షణకి విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోను కావొద్దు.
7. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి.
8. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో పడొద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి.
9. పార్టీ అభ్యున్నతి, పార్టీ కోసం కష్టించి పనిచేసే జన సైనికులు, వీర మహిళల సంక్షేమం ఎల్లప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి.

రాజకీయ ప్రత్యర్థులు సోషల్ మీడియా ద్వారా పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించేందుకు చేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణే అత్యంత కీలకమని, దానికి విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈ ప్రకటన ద్వారా పార్టీ అధిష్ఠానం గట్టి హెచ్చరికలు పంపింది. ఇటీవల ఒంగోలులో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డిల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో, పవన్ కల్యాణ్ తాజా మార్గదర్శకాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపుపై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు సరైన చట్టం లేకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆకునూరి మురళి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నీరే మాకు ఆధారం.. భారత్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకుంటాం

సింధు నదీ జలాల ఒప్పందం వివాదంపై భారత్‌ను ఉద్దేశించి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు నీరే ప్రధానమైన జీవనాధారమని, నదీ జలాల విషయంలో తమ దేశానికి వర్తించే హక్కులపై రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ... సింధు నదీ జలాల ఒప్పందంలో మార్పులు చేయడం కానీ, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా డైవర్ట్ చేయడం కానీ చేస్తే దాన్ని తమ దేశం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు. తమకు 'నీరే రెడ్ లైన్' అని, ఈ విషయంలో భారత్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

పహల్‌గామ్ ఉగ్రదాడి అనంతరం భారతదేశం సింధు నదీ జలాల ఒప్పందాన్ని సవరించాలని లేదా పునఃసమీక్షించాలని కోరుతూ పాకిస్థాన్‌కు నోటీసులు పంపిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 60 ఏళ్ల నాటి ఈ ఒప్పందంలో మార్పులు తెచ్చేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ నీటి హక్కులను కాపాడుకోవడానికి దౌత్యపరంగా, చట్టపరంగా అన్ని వేదికలపైనా పోరాడతామని షరీఫ్ పేర్కొన్నారు.ం

## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

- మొదటి పేజి తరువాయి

ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు.

అగ్నిమాపక శాఖను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం మొత్తం మూడు దశల్లో రూ. 252.86 కోట్లతో ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఇప్పటికే రూ. 33 కోట్లతో 65 వాహనాలను అందుబాటులోకి తీసుకురాగా, తాజా ప్రారంభోత్సవం రెండో దశకు చెందింది. మూడో దశలో మరిన్ని వాహనాలతో పాటు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. వాహనాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త ఫైర్ స్టేషన్ల నిర్మాణం, 36 పాత స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాహనాల పనితీరు, ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదాలకు త్వరితగతిన స్పందించి, ప్రాణ, ఆస్తినష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టినట్లు వారు తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## రామాలయం షెడ్ నిర్మాణా నికి భవాని చారిటబుల్ ట్రస్ట్ రూ.2.50 లక్షలు సహకారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 14:** స్థానిక మూడవ వార్డు సుబ్బారావు పేట రామాలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి భవాని చారిటబుల్ ట్రస్ట్ తరఫున సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు షెడ్డు నిర్మాణం అవసరాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన భవాని చారిటబుల్ ట్రస్ట్ రూ.2.50 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చారు. షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు , టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ , పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ, ఆలయ కమిటీ భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం అవసరాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగానే ఆయన వెంటనే స్పందించి భవాని చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవలకు కూడా భవాని చారిటబుల్ ట్రస్ట్ ఎమ్మెల్యే సేవలందిస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చారిత్రక, పురావస్తు ప్రదేశాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి





-- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 14:**నగరంలోని చారిత్రక, పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని ప్రదేశాలకు విశిష్టతను తీసుకువచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సుమారు రెండు గంటల పాటు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహం, రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం, కాటన్ గృహాలు, అలాగే చారిత్రక ప్రాధాన్యత కలిగిన దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలను కలెక్టర్ సందర్శించారు.
ఆయా ప్రదేశాల్లోని మౌలిక సదుపాయాలు, నిర్వహణ పరిస్థితులు, సందర్శకులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, 2027లో జరిగే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఈ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కట్టడాలను సందర్శకులకు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యాటకాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలను సమన్వయం చేస్తూ అభివృద్ధి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశిష్టత, సందర్శకుల సంఖ్య, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పుష్కరాల సమయంలో దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, పురావస్తు శాఖ జాయింట్ డైరెక్టర్ కె. తిమ్మరాజు, ఇరిగేషన్ డి.ఈ.లు ఆనందబాబు, రమేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పెరేడ్ రిహార్సల్స్ ను పరిశీలించిన ఎస్పీ డి.నరసింహ కిషోర్





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 14:**జిల్లాలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఆగస్టు15వ తేదీన నిర్వహించే 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుక పెరేడ్ రిహార్సల్స్, భద్రతా, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శుక్రవారం పరిశీలించడం జరిగింది. దీనిలో భాగంగా ఎస్పీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి, అనంతరం పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీస్ బలగాల పెరేడ్ ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...పెరేడ్ బాగుంది అని అన్నారు. ఇదే స్ఫూర్తితో రేపు కూడా పెరేడ్ రెట్టింపు ఉత్సాహంతో చెయ్యాలని సూచించారు. జెండా వందనంనకు విచ్చేయు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలకు సరియైన సదుపాయాలు, బందోబస్తు, భద్రతపై పలు సూచనలు చేసినారు. కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్లతో భద్రతా పరంగా ఎటువంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరిని డిఎఫ్ఎండి ద్వారా తనిఖీ చేసి పంపాలని, వాహనాల పార్కింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నవాబ్ పాలేం సొసైటీ అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరుగోలను నూకల బుల్లియ్య ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 14.**ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు నిర్వహిస్తున్న సేవా వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం మండలం, నవాబ్ పాలెం గ్రామంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నవాబ్ పాలేం సొసైటీ అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరుగోలను నూకల బుల్లియ్య ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు వైద్య సహాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పనిచేస్తే మంచి సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ క్యాంపుకు ప్రముఖ వైద్యులు డాక్టర్ నూకల దుర్గ ఎండి జనరల్ మరియు అత్యవసర వైద్య నిపుణులు, పడాల మధు సీఈఓ, డాక్టర్ వినతి పరిటాల ఎండి సీనియర్ కన్సల్టెన్సీ కామినేని హాస్పిటల్ వారిచే టి వి పి ఎల్ ప్రసాద్ ఎండి కార్డియాలిస్ట్ గుండె వైద్య వైద్య నిపుణులు భాగ్యశ్రీ తణుకు హాస్పటల్ వారిచే డాక్టర్ షేక్ అశ్విత్ ఎంబిబిఎస్ గర్భకోశ మరియు వ్యాధులు వైద్యనిపులు టీవీఎస్ శంకర్ రెడ్డి మానసిక వైద్యుని పునులు డాక్టర్ ఏం పీటర్ చెవి ముక్కు గొంతు వైద్యనిపుణులు అగర్వాల్ హాస్పిటల్ చే కంటి వైద్యం, జి అనూష అడ్వాన్స్డ్ ఫిజియోథెరపీ ఎమర్జెన్సీ కేర్, ఎం పవన్ వర్మ, హాస్పిటల్ సాహితీ, డాక్టర్లు చే వారిచే సూచనలు పేషెంట్లకు ఇచ్చారు.అనంతరం మందులు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలి





**పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** పర్యావరణ పరిరక్షణ కోసం పోలవరం జిల్లాలో ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం స్థానిక పీఎంఆర్సీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమన్నారు. ప్రతి వ్యక్తి తనకు నచ్చిన ప్రదేశంలో ఒక మొక్కను నాటి, దానిని క్రమం తప్పకుండా సంరక్షించాలని సూచించారు. చెట్లే ప్రతి జీవికి అవసరమైన స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు.ఒక మొక్కను నాటి దాని ఎదుగుదలను ప్రతిరోజూ గమనిస్తూ సంరక్షించినట్లే దేశం, రాష్ట్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల్లో ప్రకృతి సంరక్షణపై మరింత అవగాహన కల్పించవచ్చన్నారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, 12 మండలాల్లోని గ్రామాలు, ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల్లో ప్రకృతి పట్ల బాధ్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, ఏపీవోలు సురేష్, శ్రీనివాస్, స్వామి, జేఈ అడ్మిన్ బాబు, కోఆర్డినేటర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.




# ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ



- వ్యర్థాల నిర్వహణలో ప్రజల చైతన్యం ముఖ్యం ఎమ్మెల్యే గోరంట్ల
- కంపోస్ట్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 14:**రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా మార్చేందుకు వినూత్న విధానాలను అనుసరి స్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ లతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతు న్నట్లు పేర్కొన్నారు. ఈ చెత్తను ప్రాసెస్ చేయకపోతే టన్నుల కొద్దీ పేరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను వదిలేసి వెళ్లిందని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏడాది కాలంలోనే ఆ ప్రాసెస్ చేసినట్లు వెల్లడించారు. భూగర్భంలో మరో 156 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ఉందని ఆ వేస్ట్ ను అక్టోబర్ 2 నాటికి ప్రాసెస్ చేయడం జరుగు తుందన్నారు. అలాగే ప్రాసెస్ చేసిన ఆర్డీఎఫ్ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తామని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో ఘన వ్యర్థాల నిర్వహణకు అభివృద్ధి చెందిన దేశాలలో అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 10 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ద్వారా వేస్ట్ ను బర్న్ చేయడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. కానీ గత ప్రభుత్వం అవగాహన లేక 8 ప్లాంట్లను రద్దు చేసినట్లు మండిపడ్డారు. చైనాలో ఇటువంటి ప్లాంట్లు 1,100 ఉండగా జపాన్ లో వెయ్యి సింగపూర్ లో 7 ఉన్నాయ న్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురం కలిపి ఆరు 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెద్దాపురంలో ప్లాంట్ నిర్మాణం అడ్వాన్స్డ్ స్టేజీలో ఉండగా, మరో సంవత్సరం లో పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే 7వేల టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసేందుకు 107 ప్రాసెసింగ్ ప్లాంట్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గత నెలలో ముఖ్యమంత్రి చేతులమీదుగా 8 ప్లాంట్లను ప్రారంభించుకోగా.. సెప్టెంబర్ నెలాఖరుకల్లా మిగిలిన ప్లాంట్లను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.
ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా చైతన్యం కావాలన్నారు. ఇంట్లో చెత్త, ప్లాస్టిక్, కొబ్బరిబోండాలు, ఇతర వ్యర్థాలను కాలువల్లో వేయకుండా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, క్వారీ ప్రాంతంలోని కంపోస్ట్ యార్డు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. టన్నుల కొద్దీ లెగసీ వేస్ట్ పేరుకుపోతుండటంతో రత్నంపేట, లూథర్ గిరి, ఆర్ అండ్ బి కాలనీ ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు. నగరాన్ని అభివృద్ధి పరచుకోవడానికి పుష్కరాలను సద్వినియోగ పరచుకుంటూ నగరంలో ప్రగతి పనులు చేపడ తామని తెలియజేశారు. పర్యటనలో కమిషనర్ రాహుల్ మీనా, అదనపు కమిషనర్ పి.వి.రామలిం గేశ్వర్, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈ మాధవి, ఇతర నగరపాలక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# కాలుష్యకోరాల్లో సత్యవరం గ్రామ ప్రజలు.





**నామకర్థంగా వ్యవహరిస్తున్న పంచాయతీ శాఖ అధికారులు..**

**పెనుమంట్ర పెన్ పవర్ ఆగస్టు 14:** పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం వెలగలేరు నుండి సత్యవరం గ్రామం కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న స్మశాన వాటిక లో వెలగలేరు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నటువంటి చెత్తను తీసుకుని వచ్చి వేయడం తో చెత్త కొండలను తలపిస్తుంది. ఇదే ప్రధాన మార్గం వైపున స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు నిత్యం అనేకమంది ప్రయాణిస్తూ ఉంటారు. దీనితో వివిధ గ్రామాల నుండి సేకరించినటువంటి చెత్త గాలికి ఎగిరి ప్రయాణికుల పై పడుతుంది. దీనితో ఆ చెత్తలు ఉన్నటువంటి బాక్టీరియా వాహన ప్రయాణికులకు సోకడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. వివిధ గ్రామాల నుండి సేకరించినటువంటి చెత్త పదార్థాలును కుప్పలు కుప్పలుగా వెయ్యడంపై స్థానికులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న నామమాత్రంగా వ్యవహరిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ చెబుతున్నారు. ఈ మార్గాన నడిచే వెళ్లే ప్రజలకు వాహన ప్రయాణికులు చెత్త నుండి వచ్చే దుర్వాసనకు చాలా ఇబ్బంది పడుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలంటూ. సత్యవరం గ్రామ ప్రజలు మరియు వాహన ప్రయాణికులు, ఉన్నతాధికాలని కోరుతున్నారు...

## స్వాతంత్ర దినోత్సవ పూర్తి.. నేటి తరానికి ఆదర్శం.





**తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే బొలిశెట్టి, బిజెపి నేతలు.**

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 14.**దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో బిజెపి కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భారతమాతకు పుష్పాంజలి ఘటించి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దాస్యశృశీ ఖలాల నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని ఆయన నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన దంపతులు స్వాతంత్రోద్యమంలో ఎంతో సాహసమైన పాత్ర వహించారన్నారు. వీరితోపాటు గూడెం పట్టణానికి చెందిన పలువురు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పట్టణానికి చెందిన మహనీయులు అసలు కృష్ణమూర్తి ఆంజనేయలక్ష్మి, విగ్రహాలతో పాటు కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజు అంటే అనేకమంది విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రగతిఫధంలో పయనిస్తుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రం ఉద్యమశీ తొలి దశలో కలకత్తా నగరశీ బిపిన్ చంద్రపాల్ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి స్వాతంత్రోద్యమ యజమాని మరింత వేగవంతం చేసేందుకు ప్రజలు గంగా నదిలో మునక వేసి వందేమాతరం అని నినదించాలని ఇచ్చిన పిలుపుమేరకు వందేమాతరం నినాదంతో కలకత్తా నగరం మారుమోగిందన్నారు. ఇది దేశవ్యాప్తంగా స్వాతంత్రోద్యమానికి స్ఫూర్తినిచ్చింది అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అటు స్వాతంత్ర ఉద్యమంలోనూ స్వాతంత్ర అనంతరం నేటి వరకు వందేమాతర గీతం ఒక దివ్య మంత్రంగా స్ఫూర్తిదాయకమైందన్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 ఏళ్లుగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుందన్నారు. అట్టడుగున ఉన్న భారతగా ఆర్థిక స్థాయిని నేడు ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకువెళ్లిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని అన్నారు. మహనీయుల స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని కోరారు. బిజెపి నర్సాపురం పార్లమెంటరీ మీడియా ఇన్చార్జి నరిసే సోమేశ్వరరావు మాట్లాడితూ దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగం ఫలితంగా నేడు భారతదేశశీ ప్రగతి పదంలో నడుస్తోందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాలలోనూ ఎంతో అభివృద్ధి చేస్తుందన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను విలన్గా చిత్రీకరించే విధంగా పాఠ్యాంశాలు రూపొందించారని ధ్వజమెత్తారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి భావితరాలకు వాటిని అందిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి పట్టణం అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని విద్యార్థులు యువత ప్రజల్లో నింపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలో తెలంగాణ నిర్వహించడం హర్షణీయమన్నారు. అభివృద్ధి సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నాఎన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సుదీర్ఘకాలం ఎందరో మహనీయులు త్యాగాలు చేసి స్వాతంత్రం సాధించారన్నారు. నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తోందన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కు విశేషకృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం లోబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, నవీన్,పెదపోలు వీర రాఘవులు,తెలుగు దేశం నాయకులు మైలవరపు రాజేంద్ర ప్రసాద్, మద్దిపాటి ధర్మేంద్ర, బిజెపి రాష్ట్ర గారి వర్గ సభ్యులు కోట రాంబాబు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, పడాల కావ్యరెడ్డి, కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, కిసాన్ మోర్చా చెరుకూరి గంగాధర్, ఓ బిసి మోర్చా రాష్టకార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహ మూర్తి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మి దుర్గ,తుట్టగుంట కృష్ణ కుమారి, కూటమి పార్టీలు నాయకులు, శశి ఇంజినీరింగ్ కళాశాల, వాసవి ఇంజినీరింగ్ కళాశాల, జి ఎం ఆర్, శ్యామల జూనియర్ కళాశాల ల విద్యార్థులు భారీ ఎత్తున మువ్వన్నెల జండాలు చేతబూని వందేమాతరం నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ సెంటర్ నుంచి శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది

## మొక్కలు నాటిన జనసేన నాయకులు



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 14;** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించా లని జనసేన నాయకులు మద్దాల రమేష్ ,దేవుడు శ్రీను అన్నారు .శుక్రవారం వంకావారిగూడెం డంపింగ్ యార్డ్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు నాటి వాటి పెరుగుదలకు తోడ్పడాలని సూచించారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే మొక్కలు పెంపకం పై అవగాహన పెంచాలని వారు అన్నారు. అదేవిధంగా గ్రామంలో మొక్కలు ను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొర్లపాటి సునీల్, ఉండవల్లి నరేష్, మద్దాల నారాయణ ,అవా డు శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఏ ప్రవీణ్, మహిళా పోలీసు లలిత రాణి, హార్టికల్చర్ ఉషారాణి, డిజిటల్ అసిస్టెంట్ లలిత, వెటర్నరీ అసిస్టెంట్ నాగరాజు, ఏఎన్ఎం నాగరత్నం ,వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి కుమారి, గ్రామస్తులు మడకం అరుణకుమారి, సోడం రవి, మడకం రాజులు ,సరిపల్లి అప్పారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆ 10 గ్రామాలకు భూమి ప్యాకేజీ ఏది?



- ఇవ్వకుంటే ఐటీడీఏ ముట్టడి తప్పదు సిపిఎం
- కూనవరం 10 గ్రామాల నిర్వాసితులకు అన్యాయం
- భూమి ప్యాకేజీ,ఆర్ అండ్ ఆర్ వెంటనే ఇవ్వాలి
- 41.5 కాంటూర్ పేరుతో మోసం ఆపాలి

**కూనవరం,పెన్ పవర్, ఆగస్టు14.**పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన కూనవరం మండలంలోని 10 గ్రామాలకు ఇప్పటివరకు భూమి ప్యాకేజీ,ఆర్ అండ్ ఆర్ సౌకర్యాలు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం కార్యాలయం నందు మడకం నాగమణి అధ్యక్షత గురువారం సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఒకవైపు పుష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని, మరోవైపు భూములు కోల్పోతున్న గిరిజనులకు న్యాయం చేయడంలో మాత్రం విఫలమవుతోందని విమర్శించారు.అయ్యవారిగూడెం,వెంకన్నగ ూడెం, చిన్నారుకూరు,రేపాక, భగవాన్పురం,కూటూరు, అభిచర్ల,లింగాపురం, రేగులపాడు,కోడేరు గ్రామాలకు ఇప్పటికీ ప్యాకేజీ ఇవ్వలేదని తెలిపారు.41.5 కాంటూర్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, దీన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా 10 గ్రామాలకు భూమి ప్యాకేజీతో పాటు ఆర్ అండ్ ఆర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని,లేకుంటే ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఐటీడీఏ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

ప్రాజెక్టు పూర్తి చేయడం ఎంత ముఖ్యమో,ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న ఆదివాసులకు న్యాయం చేయడం అంతే ముఖ్య మని ప్రభుత్వాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తెల్లం తమ్మయ్య,మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మేకల నాగేశ్వరరావు,బొగ్గ సుబ్బయ్య,సోడి శంకర్, ధర్మల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

## డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు స్వాతంత్ర్య దినోత్సవం బహుమతులు ప్రధాన ఉత్సవం






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 14.** తాడేపల్లిగూడెం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రం లో స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని డైమండ్స్ క్లబ్ వైస్ ప్రసిడెంట్ లయన్ మానేపల్లి వెంకట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సౌజన్యం తో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ తరపున మూడు రోజులు దివ్యాంగుల పిల్లలకు పరుగు పందెం, క్యారం బోర్డ్, మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్, త్రో బాల్, మొదలకు క్రీడలు నిర్వహించి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సి. లయన్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు బహుమతులు అందజేసి మాట్లాడుతూ ఎంతోమంది దేశ నాయకులు బ్రిటిష్ వారిని ఎదిరించి తమ ప్రాణాలు అర్పించి మనకు స్వతంత్ర్య అందించారని వారు అందించిన స్వేచ్ఛా ఫలాలు మనము అనుభవిస్తున్నామని దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు దేశ అభివృద్ధికి తోడ్పడాలని లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ దశక సుబ్బారావు పిలుపు మేరకు స్వర్ణాంధ్ర స్వచాంద్ర పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాముల అవ్వాలన్నారు దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పోతురాజు శ్రీదేవి దంపతులను శాలువతో సన్మానించారు దివ్యాంగుల విద్యార్థులు భరతమాత, మహాత్మా గాంధీ, సోల్జర్స్, జ్యోతిరావు పూలే, సుభాష్ చంద్రబోస్ అల్లూరి మొదలగు వేషధారణాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ పాస్ట్ సెక్రెటరీ కోఠి విజయ్ కిషోర్ సభ్యులు జాయింట్ సెక్రెటరీ డివి కృష్ణకాశీత్ లయన్ యర్ర ఆంజనేయస్వామి, జాయింట్ ట్రెజరర్ తమ్మిబత్తుల సత్యనారాయణ ఆర్ అండ్ బి వాకర్స్ అధ్యక్షులు మానేపల్ వెంకట కిరణ్ కుమార్.భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్ కే బాల ఈశ్వరయ్య, ఎం చంద్ర కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటయ్య, ఉపాధ్యాయులు రాంబాబు, దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## వాసవి మాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మణిద్వీప పారాయణా పూజ లు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 14:**సృష్టి స్థితి లయ కారకులైన త్రిమూర్తులలో స్థితికారుడు దుష్ట శిక్షకుడు శిష్ట రక్షకుడు అయిన శ్రీ మహావిష్ణువుకు ఆయన దేవేరి అయిన శ్రీ మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన శ్రావణమాసం మహిళలకు అత్యంత ముఖ్యమైనది మహిళలు పాటించే వ్రతాలలో అధికంగా ఈ మాసంలోనే ఉండటం వల్ల వ్రతాల మాసం అని సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసమని అందువలన ఈ మాసంలో వచ్చే మొదటి శుక్రవారం నాడు అనగా మహిళలందరికీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతనక్షేత్రంలో సకల సౌభాగ్యాన్ని ఇచ్చే మణిద్వీప వర్ణన పూజ 108 మహిళలు చే అత్యంత వైభవంగా చేయించడం జరిగినది. కమిటీ వారు తొమ్మిది రకాల ప్రసాదాలను ఏర్పాటు చేయడం జరిగింది . ముత్తైదువులందరూ తొమ్మిది రకాల పుష్పాలు ను తీసుకుని వచ్చి తొమ్మిది సార్లు పారాయణం చేయడం జరిగింది. ఆలయ అర్చకులు ఆదిత్య శర్మగారు పరివేక్షణలో ఈ పూజలు చేయించడం జరిగింది. ఈ పూజ చేసుకోవడం వల్ల దారిద్రాన్ని తొలగించి అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని మనసు ప్రశాంతంగా ఉంటుందని గృహ నిర్మాణం చేయాలనుకునే వారి కోరిక నెరవేరుతుందని ముల్లోకాలకి జగన్మాత అయిన ఆ జగన్మాత కొలువైన ద్వీపం మణిద్వీపం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లేపర రాము, నున్న బాలత్రిపుర సుందరరావు ట్రెజరర్ బోగవల్లి రమేష్, ఆలయ సెక్రెటరీలు ఆలపాటి సత్యనారాయణ, ఆలపాటి కృష్ణకుమార్ వైస్ ప్రెసిడెంట్ కొండూరి రాము కార్యవర్గ సభ్యులు పి. అప్పారావు, ముత్త నాగేశ్వరరావు, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ కె. సునీత, ట్రెజరర్ బి. శ్యామల, పాస్ట్ ప్రెసిడెంట్ నున్న శ్రీ నాగలక్ష్మి సభ్యులు మద్దుల కుమారి, పి. సుధారాణి మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పూజలో కూర్చున్న భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేయడం జరిగింది.

## కూనవరం మండలానికి 13 అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులు

- దరఖాస్తులు ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలి



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు14.** 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టుల నియామక నోటిఫికేషన్ విడుదలైనట్లు మండల విద్యాశాఖ అధికారి టి.లక్ష్మయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కూనవరం మండలానికి 13ఎస్ జి టి పోస్టులు మంజూరయ్యాయని, ఎంపికైన వారికి నెలకు 10వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు సరైన ధ్రువపత్రాలతో ఈ నెల 22వ తేదీలోపు మండల విద్యాశాఖ అధికారికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## పోలవరం ఆర్ అండ్ ఆర్ కట్ ఆఫ్ డేట్ తొలగించాలి...

- 18 ఏళ్లు నిండిన ప్రతి యువతి, యువకులకు ప్యాకేజీ ఇవ్వాలి
- సిపిఐ డిమాండ్



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు14.** పోలవరం నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఉన్న 10-10-2022 కట్ ఆఫ్ డేట్ ను తొలగించాలని సిపిఐ కూనవరం మండల కమిటీ డిమాండ్ చేసింది.గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శి లంబు శ్రీనివాసరావు మాట్లాడుతూ, నిర్వాసితులను తరలించే రోజు వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీయువకుడికి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.మైదాన ప్రాంత రైతులకు ఎకరాకు 36 లక్షలు ఇచ్చి,గిరిజనులకు మాత్రం 10 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఇప్పటికే మోసం చేసిందని ఆరోపించారు. కట్ ఆఫ్ డేట్ పేరుతో నిర్వాసితుల పిల్లలను మోసం చేయడం సరికాదన్నారు.ఎల్ ని నో ప్రభావంతో వర్షాభావం కారణంగా వరి నాట్లు పడకపోవడంతో కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 26వ తేదీన ఐటీడీఏ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జుత్తుక సూర్యచంద్రరావు,సోడే కన్నారావు, బుడిపిటి వెంకటేశ్వర్లు,సోడే దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి కార్యాలయం లో జనతా వారధి కి విజ్ఞాపనలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్ట్14 :**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. గోదావరి జోనల్ జనతా వారధి కన్వీనర్ బొమ్ముల దత్తు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడబాల రామకృష్ణ. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కోలమూరు రోడ్ల అభివృద్ధి, కడియం మండలం వీరవరం పారిశుధ్య బాగోలేదని వినతులు , ప్రభుత్వ పింఛను, తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి.

ప్రజా సమస్యల పరిష్కా రమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగు తోందని అడబాల రామకృష్ణ. తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. జనతా వారధి జిల్లా కో కన్వీనర్ యానాపు ఏసు, బండి సత్యప్రసాద్ . స్వామి సూర్య కిరణ్. మీనాక్షి జిల్లా నాయకులు పాల్గొన్నా రుం

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్న ఎమ్మెల్యే**



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు14.** మండలంలోని టేకుబాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త జలమంతుల శ్రీను(35) ఇటీవల అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి గురువారం స్వయంగా టేకుబాక గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి 10 వేలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ టీడీపీ ఎప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.పార్టీ కార్యకర్తల కుటుంబాలకు నేను ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శిరీష దేవికి, మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు కు కృతజ్ఞతలు తెలిపారు.

## రూరల్ లో 71 మంది కి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 14:**పేదవాడి వైద్యానికి కూటమి ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం గోరంట్ల కార్యాలయం లో రూరల్ నియోజకవర్గానికి చెందిన 71 మంది లబ్ధిదారులకు రూ.80.33 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాల పాలిట సంజీవని లా నిలుస్తుందన్నారు. ఇప్పటివరకు రూరల్ నియోజకవర్గంలో 629 కుటుంబాలకు రూ.6.13 కోట్ల రూపాయలు సిఎం సహాయ నిధి అందచేసా మన్నారు. ఈ కార్యక్ర మంలో ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, , కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, యామన నారాయణ గౌడ్, పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన, కర్రీ అప్పలస్వామి, కూటమి నాయకులు గంగిన హనుమంతరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, , గట్టి సుబ్బారావు, పంతం గణపతి, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టికూటి దత్తుడు, నాగిరెడ్డి రామకృష్ణ, గంగిన నాని, పాఠంశెట్టి రాంజీ, గుర్రపు సత్యనారాయణ, మట్ట శ్రీను, ఉండవల్లి బంగార్రాజు, నిమ్మలపూడి గోవిందు, ఆళ్ల ఆనందరావు, మర్రెడ్డి రమేష్, శీలం గోవిందు, దుద్దుపూడి రమేష్, అడ్డాల శ్రీను, బొప్పన శ్రీను, పుక్కళ్ల రాజు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సురపురెడ్డి జానకి రామయ్య, పిల్ల తనుజ, గంగిన జాహ్నవి, బైరిత్తి సరోజినీ దేవి, తాడేపల్లి నాగరాజు, పెండ్యాల రామకృష్ణ, యలమాటి రామకృష్ణ, నిమ్మలపూడి రామకృష్ణ, మార్రెడ్డి రమేష్, పాతూరి రాజేష్, గోరు నాగేశ్వరరావు, దంతంశెట్టి శ్రీను, ఐ టీడీపీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రక్షా భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్వరం లో తండ్రికి క్యాన్సర్, సోదరికి గుండెజబ్బు వారికి ఆర్థిక సహాయం.



"అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ మేము అండగా ఉంటాం"

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 14.** మార్కొండపాడులో తండ్రికి క్యాన్సర్, సోదరికి గుండె జబ్బులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి చెందిన బొంత నిఖిల్ కు కాలిలో ఎముకపై ఎముక సమస్యతో శస్త్రచికిత్స చేశారు. ఆర్థిక పరిస్థితి విషమంగా మందుల కోసం శస్త్రచికిత్స అనంతరం చికిత్స ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న నిఖిల్ కుటుంబాన్ని రక్షా భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు "ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకూడదు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్షా భారత్ అండగా ఉంటుంది" అని తెలిపారు.

## మహిళల భద్రత మనందరి బాధ్యత- ఏఎస్పీ హేమంత్





**చింతూరు, పెన్ పవర్ ఆగస్టు 14:**మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతూరు ఏఎస్పీ హేమంత్ అన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు శుక్రవారం కల్లేరులో మహిళల భద్రత, సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ హేమంత్ మాట్లాడుతూ. మహిళలు, యువత మొబైల్ ఫోన్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కొంతమంది మోసగాళ్లు మొబైల్ ఫోన్ల ద్వారా మహిళలను పరిచయం చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళలు, విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే 112కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థినులు శక్తి యాప్ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లకు వచ్చే 'డిజిటల్ అరెస్ట్' పేరుతో చేసే ఫోన్ కాల్స్ పూర్తిగా మోసపూరితమైనవని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ హేమంత్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అతివేగంగా వాహనాలు నడపడం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం నేరమని తెలిపారు. మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సేవించడం, అక్రమంగా రవాణా చేయడం, అక్రమ రవాణాకు సహకరించడం నేరమని పేర్కొన్నారు. గంజాయి అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఏఎస్పీ హేమంత్ సూచించారు. ఈ సందర్భంగా యువత, ప్రజలతో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ నరసింహారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కామరాజుపేట గ్రామంలో హర్ గర్ తిరంగా జాతీయ జెండా ర్యాలీ



**గోకవరం పెన్ పవర్ 14:**-ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు గోకవరం మండలం భారతీయజనతా పార్టీ ఆధ్వర్యం లో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమం గోకవరం మండలంలోని కామరాజుపేట గ్రామంలో శు క్రవారం హర్ గర్ తిరంగా జాతీయజెండా ర్యాలీ 80 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించారు. కామరాజుపేట జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి కామరాజుపేట గ్రామం చివరి వరకు జాతీయ జెండా ర్యాలీ నిర్వహించడం చేపట్టారు. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోడీ గారు పిలుపు మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని గోకవరం మండలం భారతీయజనతా పార్టీ అధ్యక్షుడు ఇనుకోటి బాపన్న దొర అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ బాబు, బిజెపి జగ్గంపేట అసెంబ్లీ సోషల్ మీడియా ఇంచార్జ్, బీజేపీ యువమోర్చ కర్రీ మణికంఠ, సీనియర్ బిజెపి నాయకుడు ఎమ్ నాగేశ్వరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర కుమార్,పాఠశాల ఉపాధ్యాయులు గోకవరం మండల బిజెపి కార్యకర్తలు కూటమి నాయకులు పాఠశాల విద్యార్థినివిద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్లీన్ ఇండియా-గ్రీన్ ఇండియా-హెల్త్ ఇండియా







**పై యువతలో అవగాహన అవసరం**

**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 14:-** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్-ఈస్ట్ గోదావరి (ఏపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పఖ్వాడా-2026 కార్యక్రమాన్ని కోరుకొండ బ్లాక్ ప్రగతి స్కూల్ నందు నిర్వహించా మని తూర్పుగోదావరి మై భారత్ వాలంటీర్ కసిరెడ్డి శాంతికుమారి వెంకటేష్ గోకవరం లో మీడియాకు తెలిపారు. శనివారం స్థానిక మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ 15 రోజులుగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు,యువతకు పరిశు భ్రత,పర్యావరణ పరిరక్షణ,ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం,తడి-పొడి వ్యర్థాలను వేరు చేయడం, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 'క్లీన్ ఇండియా-గ్రీన్ ఇండియా-హెల్తీ ఇండియా' సందేశంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో కె. ప్రదీప్ కుమార్ డైరెక్ట్ ప్రగతి విద్యానికేతన్ కె. మీనాక్షి, సి హెచ్. బుజ్జమ్మ, ఎస్ డి. భషీరా, సి హెచ్. ప్రమీల, కె. పావని తూర్పుగోదావరి మై భారత్ వాలంటీర్ కసిరెడ్డి. శాంతికుమారి వెంకటేష్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒజుబంధలో అక్రమ మైనింగ్‌పై ఆదివాసీల ఆగ్రహం





- అధికారుల ఆదేశాలను ధిక్కరించి తవ్వకాలు.. జీడిమామిడి తోటలు ధ్వంసం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు.
- అక్రమ క్వారీని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** ఏజెన్సీ ప్రాంతమైన గంగవరం మండలం ఒజుబంధ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త క్వారీ పనులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ ఆదివాసీ రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన గ్రామసభలో కొత్త క్వారీ ఏర్పాటును గ్రామస్తులంతా వ్యతిరేకించారని, అయినప్పటికీ భారీ యంత్రాలతో తవ్వకాలు కొనసాగిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

### తోటలు ధ్వంసమవుతున్నాయని ఆవేదన

మైనింగ్ నిర్వాహకులు జేసీబీ, పొక్లెయిన్ వంటి భారీ యంత్రాలతో 'భీముడు దిబ్బల కొండ'పై తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. కొండపై తవ్వకాల కారణంగా భారీ బండరాళ్లు దిగువకు జారిపడటంతో సుమారు 20 ఏళ్లుగా పెంచుకుంటున్న జీడిమామిడి తోటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను అడ్డుకునేందుకు వెళ్లిన తమపై మైనింగ్ నిర్వాహకులు దౌర్జన్యానికి పాల్పడ్డారని, వాటాలు అందరికీ ఇచ్చేశామని చెబుతూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపణ

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పించే చట్టాలను ఉల్లంఘిస్తూ తవ్వకాలు చేపడుతున్నారని గిరిజన రైతులు ఆరోపించారు. గ్రామసభ అనుమతి, ఆదివాసీల హక్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా క్వారీ నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న క్వారీల కారణంగా ఇళ్లకు పగుళ్లు రావడం, పంటలు దెబ్బతినడం, దుమ్ము-ధూళి కారణంగా పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో మరో కొత్త క్వారీ ఏర్పాటు చేయడం వల్ల తమ జీవనోపాధి మరింత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### కలెక్టర్‌కు వినతిపత్రం

కొత్త క్వారీ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే రంపచోడవరం ఎస్టీ కమిషన్ క్యాంపు కార్యాలయం, పోలీసు అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### బాధితులకు అండగా ఉంటాం: కుంజ శ్రీను

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను బాధితులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైనింగ్ నిర్వాహకులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న భారీ యంత్రాలు, వాహనాలను పరిశీలించి అక్రమాలకు పాల్పడినట్లు తేలితే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ధ్వంసమైన జీడిమామిడి తోటలకు నష్టపరిహారం అందించాలని, బాధిత ఆదివాసీ రైతులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. అక్రమ తవ్వకాలు నిలిపివేయకపోతే జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాన్ని చేపడతామని కుంజ శ్రీను హెచ్చరించారు.

# వరి పంట బీమాకు నేటితో గడువు ముగింపు

- రైతులకు ఇదే చివరి అవకాశం..
- ఎకరానికి రూ.646 చెల్లించి నమోదు చేసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** మండలంలోని వరి సాగు చేయనున్న రైతులకు పంట బీమా నమోదు చేసుకునేందుకు రేపటితో గడువు ముగియనుంది. దీంతో అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగిసేలోగా పంట బీమా కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ సూచించారు. వరి పంటకు ఎకరానికి రూ. 646 ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంట బీమా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బీమా నమోదు కోసం రైతులు ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాల ప్రతితో పాటు స్వీయ ప్రకటన పత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పత్రాలతో సమీపంలోని సీఎస్‌సీ కేంద్రం, వ్యవసాయ సహాయకుడు లేదా ఉద్యానవన సహాయకుడిని సంప్రదించి పంట బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

# న్యాయవాది బర్ల విజయ కుమార్ వేధింపుల పై చర్యలు తీసుకోవాలి

- జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్ల, హైకోర్టు ఫిర్యాదు
- డిజిటల్ మహిళ సంఘం వ్యవస్థాపకురాలు ఈదల అశ్లేష , సభ్యులు ఆందోళన



**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఆగస్టు 14::** డిజిటల్ సాంకేతిక పరిజ్ఞాన వేదిక ద్వారా ఔత్సాహిక వ్యాపార మహిళల ఎదుగుదలపై సోషల్ మీడియా తన సంస్థపైనా, తనపైనా, మహిళా సభ్యుల పైన అసభ్యకరంగా దుష్ప్రచారం చేస్తున్న రాజానగరానికి చెందిన న్యాయవాది బర్ల విజయ్ యాదవ్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిజిటల్ మహిళ సంఘం వ్యవస్థాపకురాలు, కౌన్సిలింగ్ సైకాలజిస్టు, ఇంటర్నేషనల్ కోచ్ డాక్టర్ ఆశ్లేష ఈదల ఆందోళన వ్యక్తం చేసారు. ఈ దుష్ప్రచారం పై స్థానిక ప్రకాష్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ అతడి వేధింపులు ఆగడం లేదని, అతడిపై ఎఫ్ఐఆర్ వేసినప్పటికీ పోలీసులు అరెస్టు చేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జూలై 15 నుంచి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ ఒక యు ట్యూబ్ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్టు చేస్తున్నారని వాపోయారు. ఆ వేధింపులు తమను, సంస్థ సభ్యులను ఇబ్బందులుకు, మనోవేదనకు గురిచేస్తు న్నాయని తెలిపారు. శృతి మించిపోతుండటంతో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసామని, ఈ కేసును ప్రకాశం నగర్ స్టేషన్ కు రిఫర్ చేసారనివివరించారు. సిఐ ఆ వ్యక్తికి ఫోన్ చేసి ఇటువంటి వీడియోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నిస్తే ఆయనపై కూడా ఎదురు తిరిగారన్నారు. తమ డిజిటల్ మహిళ సంఘం సంస్థకు ఎంఎస్ ఎంఇ తో పాటు అన్ని రకాల ప్రభుత్వ గుర్తింపులు ఉన్నాయని, పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. గృహ, కుటీర పరిశ్రమల ఉత్పత్తులను అంతర్జాతీ య డిజిటల్ వేదిక ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల నుంచి తమ సంస్థలో 22 వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఎపి, తెలంగాణా, బెంగుళూరు, ముంబై, రాయలసీమ ప్రాంతాలకు చెందిన ఎందరో సంస్థ సహకారంతో ఆయా కుటుంబాల్లో ఉన్నతి సాధించారన్నారు. బర్ల విజయ్ న్యాయవాదినని చెబుతున్నాడని, బార్ అసోసియేషన్ లో ఫిర్యాదు చేసామని తెలిపారు. ఇతని దుష్ప్రచారానికి మనోవేదన గురై ఎవరైనా మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటే ఎవరూ బాధ్యత వహిస్తా రని ఆమె ప్రశ్నించారు. తమ సంస్థతో అతనికి సంబంధం లేదని ఉద్దేశ్య పూర్వకంగా సంస్థ ను దెబ్బతీసేందుకు అతడు చేస్తున్న ప్రయత్నాలపై తాము పోరాటం చేస్తామ న్నారు. సంస్థ పరంగా లోపాలు ఉంటే చట్టపరంగా ఎదురుకోవాలని, మహిళలను దూషించడం నీచ సంస్కృతికి అర్థం పడుతుందన్నారు. అవసరమైతే జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్ల , హై కోర్టు దృష్టికి తీసుకెళ్తామని దృష్టి తీసుకువెళ్తామని స్పష్టం చేసారు. అతడిపై చట్ట, న్యాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సమావేశంలో పలువురు సంస్థ సభ్యులు కాంతిప్రియ, చందన, ఉమామహేశ్వరి, జ్యోతి, భవాని పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత సర్వే పై అవగాహన సదస్సు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** ఒక ఏడాదిలో నగరంలో పుష్కరాలు జరగబోతున్న నేపథ్యంలో మహిళా భద్రతకు పెద్దపీట వేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సూచనలతో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో సేఫ్టీ ఆడిట్ ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. గురువారం యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విసి ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హైదరాబాద్ నుండి డాక్టర్ శ్రీనివాస్ సూరిశెట్టి నగరంలోని ఎన్జీవోలు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు, మెప్మా సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఉమెన్స్ సేఫ్టీ కి సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లను ఎంపిక చేసిందని వీటి ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళా కమిషన్ సూచన మేరకు విశ్వవిద్యా లయంలో సేఫ్టీ ఆడిట్ కు సంబంధించిన సమావేశం నిర్వహించామన్నారు. ఒక ఏడాది కాలంలో అత్యంత వైభవంగా పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. గోదావరి పర్యాహక ప్రాంతాల్లోని వివిధ ఘాట్లు వాటికి చేరుకునే మార్గాల్లోని భద్రత ఏర్పాట్లు వంటి అంశాలపై టీంలు వారీగా పరిశీలన చేస్తారని చెప్పారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో నగరాన్ని సేఫ్టీ గా తీర్చిదిద్దేందుకు వివిధ ప్రణాళికలు రూపొంది స్తున్నామని తెలిపారు. మొదటి విడతగా నగరంలోని ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మ్యాపింగ్ కు సంబంధించి పోలీసు, మెప్మా, ఉమెన్ అండ్ చైల్డ్ మరియు విశ్వవిద్యాలయ వాలంటీర్లు కలిసి పని చేస్తారని చెప్పారు. త్వరలో ఒక వర్క్ షాప్ నిర్వహిస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె వి స్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కె.దీప్తి, యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ సభ్యులు పి ఉమామహేశ్వరి దేవి, డి జ్యోతిర్మయి, డి కళ్యాణి, వి. పెర్సిస్, కొవ్వూరు డివిజన్ సిడిపిఓ కే నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి







- మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి:
- పోలవరం ఓఎస్‌డీ అడ్మిన్ ఎం. జావలి ఆల్ఫాన్

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలవరం ఓఎస్‌డీ అడ్మిన్ ఎం. జావలి ఆల్ఫాన్ సూచించారు. శుక్రవారం అతి సమస్యాత్మక గ్రామమైన మోహనాపురంలో ఆమె పర్యటించి, సైబర్ నేరాలు, మహిళా భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణ, మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని, వాటిపై అవగాహన పెంచుకుని అవసరమైన సందర్భాల్లో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకూడదని, బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని హెచ్చరించారు. పిల్లలను ఉన్నతంగా చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

### సైబర్ మోసాలపై జాగ్రత్త అవసరం

సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఓఎస్‌డీ సూచించారు. ఆన్‌లైన్ యాప్‌లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసాలపై కుటుంబ సభ్యులు, విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యతోనే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని అన్నారు.

### ఆశ్రమ పాఠశాల పరిశీలన

అనంతరం ఓఎస్‌డీ మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువులు, పాఠశాలలోని సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మాజి జెడ్పిటిసి వెంకటరెడ్డి, టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, మండల కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ,పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మెషిన్ లెర్నింగ్‌తో సరికొత్త అవకాశాలు

## ఆదిత్య యూనివర్సిటీలో ఈఈఈ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం



**గండేపల్లి, పెన్ పవర్(సూరంపాలెం) ఆగస్టు 14:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో మెషిన్ లెర్నింగ్ వినియోగం రోజురోజుకూ విస్తరిస్తోందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఐటీ ఏపీ), తాడేపల్లిగూడెం, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎ. శ్రీకాంత్ తెలిపారు.

ఆదిత్య యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో "ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో మెషిన్ లెర్నింగ్ వినియోగం" అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డా. శ్రీకాంత్ విద్యార్థులకు మెషిన్ లెర్నింగ్ ఆధారిత ఆధునిక సాంకేతికతలపై అవగాహన కల్పించారు.

ఎలక్ట్రికల్ వ్యవస్థల్లో ఫాల్ట్ డిటెక్షన్, లోడ్ ఫోర్‌కాస్టింగ్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, స్మార్ట్ గ్రిడ్ వంటి విభాగాల్లో మెషిన్ లెర్నింగ్ అనువర్తనాలను వివరించారు. భవిష్యత్‌లో విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ కీలక పాత్ర పోషించనున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమాన్ని ఈఈఈ విభాగాధిపతి డా. వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో-వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో-వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ అండ్ సైన్స్) డా. ఎ. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పరిశోధన, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఈఈఈ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల్లోనే ఐమాస్ట్ లైట్ ఏర్పాటు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 14:** మన వార్డులో -- మన ఆదిరెడ్డి కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు 3వ డివిజన్ సుబ్బారావుపేట షాదీఖానా వద్ద ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముస్లింలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాదీఖానా ప్రాంతం మైనారిటీలకు పవిత్రమైన ప్రదేశమని, రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే స్పందించి వారం రోజుల్లో లైట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి ఐదు రోజుల్లోనే ఐమాస్ట్ ఏర్పాటు చేయించారన్నారు. సుబ్బారావుపేట రామాలయానికి రూ. 2.50 లక్షలతో షెడ్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఏబీవీకి ఏమైంది

**విజయవాడ, ఆగస్టు 14 పెన్ పవర్:** రాజకీయాల్లో శత్రువుకి శత్రువు మిత్రుడు కావడం ఎంత సహజమో, ఐడియాలజీ లేదా స్వప్రయోజనాల విషయంలో విభేదాలు వస్తే నిన్నటి మిత్రుడే నేడు తీవ్ర విమర్శకుడిగా మారడం కూడా అంతే సహజం. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ సరిగ్గా ఈ సమీకరణాల చుట్టూనే తిరుగుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో కక్షసాధింపు చర్యలకు గురయ్యారనే సానుభూతితో, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ శ్రేణులు.. నేడు ఆయన మారుతున్న వైఖరిని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నాయి ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌కు గురై, తీవ్ర కేసులను ఎదుర్కొన్న సమయంలో టీడీపీ శ్రేణులు, మీడియా ఆయనను ఒక బాధితుడిగా ' భావించి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగం ఆయనపై చూపిన కఠిన వైఖరిని తప్పుబడుతూ ఆయనకు సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై ఉన్న సీఐడీ కేసులు, విచారణలను పక్కనబెట్టి, ఆయన వివాదాలకు ముగింపు పలికి క్లీన్ చిట్ లభించేలా చట్టబద్ధమైన ఊరట నిచ్చింది. అయితే, ఆ తర్వాత ఏబీ వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న తీరు, ఆయన మాటల శైలి టీడీపీ క్యాడర్‌కు తీవ్ర మింగుడుపడటం లేదు. ఇటీవలి కాలంలో ఆయన ప్రభుత్వ ప్రాజెక్టులు, పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండటం చర్చనీయాంశమైంది. రాయలసీమ ప్రాజెక్టులైన కడప స్టీల్ ప్లాంట్‌పై స్పందిస్తూ.. అది కేవలం ఒక రోలింగ్ మిల్ మాత్రమేనని, సమగ్ర స్టీల్ ప్లాంట్ కాదంటూ ప్రెస్ మీట్లు పెట్టి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. గతంలో ఆయనను తీవ్రంగా వేధించిన, ట్రోల్ చేసిన వైఎస్సార్సీపీ

సానుభూతి మీడియా ఛానెళ్లకు, యూట్యూబ్ వేదికలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ, కూటమి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టడం ద్వారా ఆయన పూర్తిగా ప్రత్యర్థి ఫోల్డ్‌లోకి వెళ్లిపోయారనే భావన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత అజెండాలు లేదా ప్రభుత్వంపై పెంచుకున్న తీవ్రమైన అసంతృప్తి వల్ల విచక్షణ కోల్పోయి, లేనిపోని అంశాలపై విమర్శలు చేస్తున్నారనే విమర్శలు ఆయనపై వస్తున్నాయి. గతంలో ఆయన పడిన కష్టాలకు మద్దతుగా నిలిచి, ఆయనను నెత్తిన పెట్టుకున్న టీడీపీ క్యాడర్ ఇప్పుడు ఇలాంటి వ్యక్తినా మనం సమర్థించింది అని తీవ్ర అసంతృప్తితో ఉంది. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మారే వైఖరికి మధ్య ఉన్న సన్నని గీత దాటడం వల్ల ఏబీ వెంకటేశ్వరరావు తన సొంత విశ్వసనీయతను దెబ్బతీసుకున్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...

**తిరుపతి, ఆగస్టు 14 పెన్ పవర్:**
మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ-2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్దిరెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది. ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

## తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్

**తిరుమల, ఆగస్టు 14 పెన్ పవర్:** తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు. ఈ శ్రీపాదం, అచ్యుత భవనాలు తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు చొప్పున మొత్తం 1064 గదులు ఉంటాయి.. ఈ రెండు సముదాయాలలో కలిపి 10వేల మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. అచ్యుతం, శ్రీపాదం వసతి సముదాయాల్లోని భవనాల్లో రిసెప్షన్, అన్నదానం, డార్మెటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.. దాదాపు 7వేల మంది భక్తులకు సరిపోయేలా లాకర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. ఈ రెండు వసతి సముదాయాల నిర్మించాలని 2022లో అప్పటి టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కానీ నిర్మాణ పనులు 2024 మార్చిలో ప్రారంభంకాగా.. 2026 ఏప్రిల్‌కు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు కాస్త ఆలస్యం కావడంతో బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం -

**విజయవాడ, ఆగస్టు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మీడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు. అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస సముదాయాలు, గుంటూరు సమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ 6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది. గతంలో 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ-వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది.

# పాపం గోరంట్ల




**అనంతపురం, ఆగస్టు 14 పెన్ పవర్:**
పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

# కుప్పం ఎయిర్ పోర్టుపై తమిళ రాజకీయాల్లో చర్చ



**తిరుపతి, ఆగస్టు 14 పెన్ పవర్:**
ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకే ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డుపుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారుఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు

**విశాఖపట్టణం, ఆగస్టు 14 పెన్ పవర్:** విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచన తో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిల పాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# శ్రీలంకతో టెస్ట్ సిరీస్.. కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు

- డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడమే లక్ష్యమన్న గిల్
- డబ్ల్యూటీసీ పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్
- బుమ్రా లేకపోయినా పేస్ విభాగంపై కెప్టెన్ విశ్వాసం
- ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌పై గిల్ ప్రత్యేక ప్రశంసలు
- గాలేలో గాలి దిశ కీలకమని గిల్ వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే తమ ప్రధాన లక్ష్యమని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. శ్రీలంకతో రేపు శనివారం గాలేలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం. గాలే వేదికగా జరిగే 50వ టెస్టు కూడా ఇదే.
ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే తొమ్మిది టెస్టుల్లో దాదాపు ఆరు లేదా ఏడు మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయని గిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది.
కాగా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత జట్టు ముందుగానే అక్కడికి చేరుకుంది. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తో సన్నాహక మ్యాచ్ ఆడింది. ఈ అదనపు సమయం ఆటగాళ్లకు పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడిందని గిల్ చెప్పాడు.
బుమ్రా లేకపోయినా భారత ఫాస్ట్ బౌలింగ్‌పై గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించాడు. గుర్నూర్ బ్రార్
కూడా పాత బంతితో మంచి బౌన్స్ రాబట్టగలడని పేర్కొన్నాడు. శ్రీలంకలో పిచ్ ల నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని.. అలాంటి పరిస్థితుల్లో విభిన్న వ్యూహాలతో ఒత్తిడి పెంచాల్సి ఉంటుందని చెప్పాడు.
దేవదత్ పడిక్కల్‌పై కూడా గిల్ ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇండియా-ఏ తరఫున శ్రీలంకలో ఆడిన అనుభవం అతడికి ఉపయోగపడుతుందని తెలిపాడు. గాలే లాంటి ఓపెన్ మైదానాల్లో గాలి దిశ బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుందని వివరించాడు.

# బీసీసీఐలో భారీ మార్పులు.. డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వీవీఎస్ లక్ష్మణ్?

- సెప్టెంబర్ ఏజీఎంలో అధికారిక ప్రకటనకు అవకాశం
- చీఫ్ సెలక్టర్ అగార్కర్ పదవీకాలంపైనా త్వరలో నిర్ణయం
- గతంలో హెడ్ కోచ్ పదవిని తిరస్కరించిన లక్ష్మణ్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలనా వ్యవస్థలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (సీవోఈ) అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్‌కు పదోన్నతి లభించనుంది. అతడిని 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' అనే కొత్త, శక్తిమంతమైన పదవిలో నియమించేందుకు బోర్డు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.
ప్రస్తుతం లక్ష్మణ్ సీవోఈ (గతంలో జాతీయ క్రికెట్ అకాడమీ) హెడ్‌గా ఆటగాళ్ల పునరావాసం, శిక్షణ వంటి బాధ్యతలు చూస్తున్నాడు. 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమితులైతే, ఆయన పరిధి మరింత విస్తృతం కానుంది. సీనియర్ పురుషుల, మహిళల జట్ల వ్యూహరచన, జాతీయ సెలక్షన్ కమిటీతో సమన్వయం, జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయి వరకు ఆటగాళ్ల ప్రగతిని పర్యవేక్షించడం వంటి కీలక అధికారాలు ఆయన చేతికి వస్తాయి.
ఇదే సమయంలో, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం కూడా సెప్టెంబర్‌తో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని 2027 జూన్ వరకు పొడిగించాలా? లేక కొత్త వారిని నియమించాలా? అనే అంశంపై కూడా బీసీసీఐ చర్చిస్తోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంతో సమన్వయం కోసం లక్ష్మణ్ లాంటి అనుభవజ్ఞుడి సేవలు అవసరమని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.గతంలో రాహుల్ ద్రవిడ్ తర్వాత టీమిండియా హెడ్ కోచ్ పదవిని చేపట్టాలని బీసీసీఐ కోరినప్పటికీ, లక్ష్మణ్ సున్నితంగా తిరస్కరించాడు. బెంగళూరులోని నూతన సీవోఈ ప్రాజెక్టుపై దృష్టి సారించేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గాడిన పడటంతో, ఆయన అనుభవాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించుకునేందుకు బీసీసీఐ సిద్ధమైంది.


# ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర.. టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లా బ్యాటర్‌గా తన్జీద్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. యువ ఓపెనర్ తన్జీద్ హసన్ తమీమ్ చారిత్రక సెంచరీతో అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు అద్భుతమైన శతకం బాదిన తన్జీద్.. కంగారూల గడ్డపై టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను ఆడుతున్న రెండో టెస్టులోనే ఈ 25 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.
ఈ క్రమంలో 23 ఏళ్ల నాటి రికార్డును తన్జీద్ బద్దలు కొట్టాడు. 2003లో మాజీ ఓపెనర్ హన్నన్ సర్కార్ చేసిన 76 పరుగులే ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఒక బంగ్లా బ్యాటర్ చేసిన అత్యధిక స్కోరు. దానిని అధిగమిస్తూ తన్జీద్ 190 బంతుల్లో 101 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 బౌండరీలు, ఒక భారీ సిక్సర్ ఉన్నాయి.అంతకుముందు తొలి రోజు బంగ్లా పేసర్ హసన్ మహమూద్ (6/55) అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియాను కేవలం 198 పరుగులకే ఆలౌట్ చేసిన సంగతి తెలిసిందే. దీనికి సమాధానంగా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌కు తన్జీద్ వెన్నెముకగా నిలిచాడు. కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్‌లతో కూడిన ప్రపంచ స్థాయి ఆస్ట్రేలియా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండో ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో జీరో పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి బతికిపోయిన తన్జీద్, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మొమినుల్ హక్ (49)తో కలిసి రెండో వికెట్‌కు 102 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 188 బంతుల్లో తన తొలి టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత నాథన్ లియాన్ బౌలింగ్‌లోనే లాంగ్-ఆఫ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.
"ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఇది నాకు చాలా ప్రత్యేకం. నేను ప్రశాంతంగా ఉంటూ, సాధారణ క్రికెట్ షాట్లు ఆడేందుకు ప్రయత్నించాను" అని తన్జీద్ తెలిపాడు. మొత్తం మీద తన్జీద్ చారిత్రక ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఈ టెస్టులో పట్టు బిగించింది. ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయం సాధించే దిశగా ఆ జట్టు అడుగులు వేస్తోంది.

## శ్రీను వైట్ల మళ్లీ మెషిన్ కామెడీ పట్టుకున్నాడా?

శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్ మీద ఫిల్మ్ సర్కిల్స్ లో రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమా పాయింట్ కి సంబంధించి బయటకు వచ్చిన కొన్ని రిపోర్ట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇందులో టైమ్ మిషన్ కు సంబంధించిన ఒక ఎలిమెంట్ ఉండబోతోందనే టాక్ గట్టిగా ప్రచారంలోకి వచ్చింది. అయితే మేకర్స్ నుంచి దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రమోషనల్ అప్డేట్ రాలేదు కాబట్టి, ఇది ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ కథా లేక కథలో ఒక భాగమా అనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.హీరో శర్వానంద్ ట్రాక్ రికార్డ్ గమనిస్తే ఆయన గతంలోనే 'ఒకే ఒక జీవితం' సినిమాతో టైమ్ ట్రావెల్ జానర్ ను టచ్ చేశారు. ఆ ప్రాజెక్ట్ లో మదర్ సెంటిమెంట్ తో పాటు ఎమోషనల్ జోన్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లోనూ టైమ్ మిషన్ అనే పాయింట్ బయటకు రావడంతో, శర్వా మరోసారి అదే జానర్ లోకి అడుగు పెడుతున్నాడా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో మొదలైంది.
అయితే గతంలో ఎమోషన్ కు స్కోప్ ఉంటే, ఈసారి దర్శకుడి మార్కు ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందేమో అనే ఆలోచన కూడా వస్తోంది. మరోవైపు శ్రీను వైట్ల పాస్ట్ ఫిలిమ్స్ ను ఒకసారి పరిశీలిస్తే ఆయన శైలికి తగ్గట్టుగా విభిన్నమైన కామెడీ ట్రాక్స్ ను డిజైన్ చేయడంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ నటించిన 'బాద్ షా' సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్ ను అమాయకుడిని చేసి "డ్రీమ్ మెషిన్" అనే ఒక ఫేక్ కాన్సెప్ట్ ను క్రియేట్ చేసి థియేటర్లలో పెద్ద ఎత్తున నవ్వులు పూయించారు. ఆ సీన్స్ అప్పట్లో సినిమాకి మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా నిలిచాయి.ఇప్పుడు శర్వా తో కూడా నిజంగానే ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తో కూడిన టైమ్ మిషన్ కథ ఉంటుందా, లేదంటే బాద్ షా తరహాలోనే ఏదైనా ఫిక్షనల్ సెటప్ లేదా కామెడీ డివైజ్ క్రియేట్ చేసి దాని చుట్టూ ఫన్ నడిపిస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. శ్రీను వైట్ల మార్కు ప్రెసెంట్ చేసే పద్ధతి తెలిసిన వాళ్లు మాత్రం, ఈ పాయింట్ ను సీరియస్ కథగా కాకుండా తన స్టైల్ లోనే ఎంటర్‌టైన్మెంట్ కు వాడుకునే ఛాన్స్ ఉందేమో అనుకుంటారు.ఒకవేళ నిజంగానే కామెడీ డివైజ్ చుట్టూ కాకుండా ప్రాపర్ టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నడిచినా, శ్రీను వైట్ల శైలిలో సిట్యువేషనల్ హ్యూమర్ కు మంచి స్కోప్ దొరికే అవకాశం ఉంటుంది. శర్వానంద్ టైమింగ్ కి, శ్రీను వైట్ల కామెడీ ఐడియాలకు తోడు ఈ కొత్త బ్యాక్ డ్రాప్ కూడా తోడైతే అవుట్ పుట్ డిఫరెంట్ గా వచ్చే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్ట్ లో నిజంగానే ఏదైనా టైమ్ ట్రావెల్ ఎలిమెంట్ ఉందా లేక శ్రీను వైట్ల తన పాత ఫార్ములాలోనే ఏదైనా ఫేక్ కన్ఫ్యూజన్ డ్రామా సెట్ చేశారా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# జాన్వీ - రష్మిక కాంబోలో ట్విస్ట్.. 'రాకా'లో సీక్రెట్ ఏంటి?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతోన్న పవర్ ఫుల్ పాన్ వరల్డ్ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ 'రాకా'. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రతీ చిన్న వార్త నెట్టింట క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల పాత్రలకు సంబంధించిన ఆసక్తికర వివరాలు లీకై సోషల్ మీడియాలో విపరీతమైన క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. ఆ లేటెస్ట్ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గిరిజన రాణిగా జాన్వీ కపూర్:**
ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో జాన్వీ కపూర్ ఒక పవర్‌ఫుల్ గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించబోతుందట. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన రోల్ అని టాక్. ఇక ఇప్పటివరకు గ్లామరస్ పాత్రల్లోనే మెరిసిన జాన్వీ, ఈ సినిమాలో చాలా విభిన్న పాత్ర తో అలరించనుందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**రక్షకురాలిగా రష్మిక మందన్న:**
మరోవైపు రష్మిక మందన్న కూడా ఈ సినిమాలో ఓ ప్రత్యేకమైన రోల్ చేయబోతోందని సమాచారం. కథానాయకుడికి ఒక గైడ్‌గా, రక్షకురాలిగా వ్యవహరించే పాత్రలో రష్మిక కనిపించనుందట. సెంట్రల్ స్టోరీలైన్‌తో ఈమె పాత్రకు బలమైన కనెక్షన్ ఉండబోతోందని లీక్డ్ వార్తలు చెబుతున్నాయి. ఇక ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్స్‌లో ఈ ఇద్దరు భామలు అదరగొట్టబోతున్నారని టాక్.

**మ్యూజిక్ అండ్ షూటింగ్ అప్‌డేట్:**
ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ అల్లు అర్జున్, దీపికా పదుకొణె కాంబినేషన్ సీన్లను చిత్రీకరిస్తున్నారు. ఇక ఈ భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంగ్ సంగీతం అందిస్తున్నారు. బిగ్గెస్ట్ కాస్టింగ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా మారింది.

**సైన్స్ ఫిక్షన్ విత్ మైథాలజీ ట్విస్ట్:**
'రాకా' అంటే నిండు పౌర్ణమి అనే అర్థం ఉంది. చీకటి నుంచి వెలుగును నింపే యోధుడిగా అల్లు అర్జున్ కనిపించబోతున్నారని, సైన్స్ ఫిక్షన్ కథకి అట్లీ మైథలాజికల్ టచ్ ఇస్తున్నారని నెట్టింట రకరకాల థియరీలు వైరల్ అవుతున్నాయి.
ఇక రోజుకో కొత్త వార్త బయటకు వస్తుండటంతో ఈ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందోనని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.
జాన్వీ కపూర్, రష్మిక మందన్నల రోల్స్‌పై వస్తున్న కథనాలపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే అట్లీ విజన్, బన్నీ ఊరమాస్ క్రేజ్ తోడు కావడంతో 'రాకా' సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965